క త్తిపీట మీద వేలు సన్నగా కోసుకుంది. రక్తం చిమ్ముతూండగానే కూరగిన్నె దూరంగా తోసి, లేచి నిలబడింది రాధ. నేలమీద ఎర్రని చుక్కలు రెండు పడ్డాయి. అది చూసి నాగులు తల్లిని వాటేసుకుని గట్టిగా ఏడవటం ప్రారంభించింది.

గుమ్మంలో వచ్చి నిలబడ్డ ఆడబిడ్డ రాధ వైపు ఖంగారుగా చూసింది. వెనకాలే చలపతి తల కనపడుతోంది. అతని కళ్ళు కుతూహలంగా భార్యవైపు చూస్తున్నాయి. అసలు మామూలు పరిస్థితిలో అయితే, వాళ్ళిద్దరూ రాధ వైపు పరుగెత్తుకు వచ్చి, పిల్లని తల్లినుంచి విడదీసి, విషయమేమిటని అడిగేవారే, కానీ ఆ వేళ పరిస్థితులు వేరు.

ఉదయం లేచింది మొదలు ఇంట్లో రకరకాల శబ్దాలు వినబడుతున్నాయి. పిల్లలు నవ్వుతూ గలగలమంటున్నారు. మరుక్షణం ఏడుస్తున్నారు. దెబ్బలాడు కుంటున్నారు. కొట్టుకుంటున్నారు. ఒకరి వెనకాల ఒకరు పరుగెత్తుతూ, తోసుకుంటూ, కత్తి పీటలు, కూరబుట్టలులాటివాటిని దాటుతున్నారు.

ఇవేళ అదేం చిత్రమో ఆ కత్తిపీట, కూర బుట్టలు దారిలో తియ్యవలసిన వాళ్ళు కూడా బాగా గొడవ ప్రారంభించారు. నవ్వులతో ప్రారంభమైన సూటీ పోటీ మాటలు చివరికి తగూల్లోకి, తిట్లలోకి, ఏడుపు, పెడబొబ్బల్లోకీ దారితీశాయి. ఈ సమయానికి రాధ అత్తగారు వెంకమ్మ మేడ మీద గదిలో కోపంతో అట్టుడికిపోతూ కూర్చుని వుంది. ఆవిడకి ఒకపక్క పెద్ద కొడుకు రంగ నాథం, రెండోపక్క భర్త రాంబ్రహ్మం కూర్చుని, ఆమెని మళ్ళీ మామూలు మనిషిని చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దకోడలు శాంతి తన సామాన్లవీ సర్దుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తూంది. ఆ సామాన్లని మళ్ళీ వాటి వాటి స్థానాల్లో పెట్టి, ఆమెని ఊరడించేందుకు ప్రయత్నిస్తోంది చిన్నాడపడుచు. ఆ ఇంటి చిన్న కోడలు గజ గజ వణికిపోతూ మంచాన్ని అంటిపెట్టుకుని కూర్చుని వుంది.

అసలు అశాంతి అంతా ఆ కత్తిపీట దగ్గిరే ప్రారంభమయింది. నవ్వులాటలుగా ఒకరి దగ్గర నుంచి ఒకరు లాక్కుంటూ ఆ కత్తిపీటనే చివ రికి బరబరా అటూ ఇటూ ఈడ్చారు. కూరల బుట్ట బోర్లా పడింది. ఉల్లిపాయలు దొర్లుకుంటూ తూము వైపుకి పోయాయి. "ఈ వేళ కూర ఏం చేయాలి?" అనే చిన్న విషయం మీద ప్రారంభమయిన మీమాంస "మీ వాళ్ళు పెళ్ళిలో



ఏం పెట్టాలి?'' అనే పెద్ద విషయం వరకూ వెళ్ళింది. కనుబొమలు ఎగిరాయి. చేతులు ఇటూ అటూ వూగాయి. చీర కొంగులు నడుం చుట్టూ బిగుసుకున్నాయి. గొంతులు పెద్దవయ్యాయి. కొన్ని గొంతులు కీచుమంటూ దుఃఖంలోకి దిగాయి. పెద్దవాళ్ళు ప్రతిజ్ఞలు పూనితే, చిన్న వాళ్ళు భర్తల చేతుల్లో వాలి తమని రక్షించ మన్నారు. కాస్త ధైర్య సాహసాలు గలవాళ్ళు వేరింటి కాపురం పెడతామని గట్టిగానే ప్రక టించారు.

ఈ గందరగోళంలో ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి పోగా రాధకి కత్తిపీటా, కూరల బుట్టా పని తగిలింది. మనసులు కష్టపడినా, మాటలు మిగిలి పోయినా, ఇంట్లో మగవాళ్ళు నాలుగు మెతుకులు తిని ఆఫీసులకి వెళ్ళక తప్పదు. ఆ వేళ రాధ భర్త తంచనుగా పదికల్లా ఆఫీసుకి చేరవలసిన అత్యవసరమైన పని వుంది. అందుకని కూరలు ముందేసుకుని, మధ్య మధ్య తాను ఆ రోజు వినవలసి వచ్చిన అప్రస్తుతపు మాటలు మననం చేసుకుంటూ, కళ్ళల్లో పేరుకుంటున్న నీటిని ఆప ప్రయత్నిస్తూ, రాధ ఓ వంకాయ కసుక్కున తరిగింది. కానీ మనసు, శరీరం అదుపులో లేక, తల గిర్రున తిరుగుతుండడం వల్ల వేలు కోసు కుంది. అంతవరకూ మనసులో ముసురుకుంటున్న చిరాకు, కోపం, తన నిస్సహాయ స్థితి పట్ల జాలి, అభిమానం పెల్లుబకగా ఆమె చివాలున లేచి నిలబడింది. ఇవాళ అటో ఇటో తేల్చుకోవాలి అని నిశ్చయించుకుంది.

భార్య ముఖంలో ఏదో నిశ్చయం చూసి చలపతికి ముచ్చెమటలు పోశాయి. తువ్వాలుతో ముఖం అద్దుకుంటూ అతను తన గదికి దౌడు తీశాడు. ఏడుస్తున్న నాగుల్ని ఒక్క తోపు తోసి రాధ ఆ గదిలో ప్రవేశించింది. ''ఈసంసారం నా వల్ల కాదు! ఎన్నాళ్ళని ఓర్చుకోను. మీకయితే ఏమీ పట్టదు'' అంటూ కోపంతో పెదిమలు వణుకుతుంటే, కన్నీళ్ళు తుడుచుకోసాగింది.

చలపతి, భార్య భుజం మీద చెయ్యి వేసి, ''ఊరుకో! నాకన్నీ తెలుసు. ఇవాళటికి నేను హోటల్లో తింటాను. సాయంత్రం వచ్చాక అన్నీ మాట్లాడుకుందాం. నాగులు చూడు ఎలా ఏడు స్తోందో'' అంటూ బుజ్జగించాడు.

''మీరెప్పుడూ ఇలాగే అంటారు. సరే సాయంత్రం ఆఫీసునుంచి తిన్నగా ఇంటికి రండి'' అంటూ కళ్ళు తుడుచుకుంది రాధ.

*

ఆ రోజు ఆఫీసులో కూర్చున్నాడన్న మాటే గానీ చలపతి ఏమీ పని చేయలేకపోయాడు. మనసంతా ఇంటిచుట్టూ, ఇంటి సమస్యల చుట్టూ తిరుగుతూంది. తండ్రి రిటైరయేనాటికి ప్రభుత్వోద్యోగంలో మంచి హోదానే అందు కున్నాడు. సంసారం పెద్దదయినా, కొడుకులు ముగ్గురికీ మంచి చదువులు చెప్పించాడు. ఎరిగున్న కుటుంబంలోని పిల్లల్నే కోడళ్ళుగా తెచ్చు కున్నాడు. కానీ ఆడపిల్లలిద్దరికీ ఇంకా పెళ్ళిళ్ళు చేయవలసి వుంది. ఒక్కో కొడుక్కీ ఒక గది చొప్పున సొంత కొంప వుంది. కొడుకుల సంపాదన అంతగా చెప్పుకోదగ్గది కాదు. వాళ్ళ సంసారాలూ పెరుగుతున్నాయి. కానీ జీవితం సాఫీగా గడచిపోతోంది.

ఉషారాణి భాటియా



కానీ ఇంట్లో సభ్యులు పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా పిల్లలు, ఇంటి వాతావరణం మార్పు చెందుతున్నాయి. ఆదరాభిమానాలు, గౌరవం వుండవలసిన చోట, అపార్థాలు, మనస్పర్థలు రేగు తున్నాయి. పరిహాసాలే ఆగ్రహానికి దారి తీస్తు న్నాయి. చిన్న చిన్న మాటలకే పెద్ద అర్థాలు తేలుతున్నాయి. అవసరం లేనిచోట నాలుగు మాటలు అతిగా అనేయటం, అవసరమున్న చోట నోరు మెదపకపోవటం, అర్థంలేని తల నొప్పులు, గుండె దడలు—యిలా ఆ ఇంటికి ఒక కొత్త రూపం వచ్చింది.

ఆవేశంలో, ఉద్రేకంలో వేరింట కాపురం పెడదామంటే ఆర్థిక స్థోమత కొరవడిన చలపతి రాధకేం సమాధానం ఇవ్వగలడు? కొడుకుల ఈ పరిస్థితి పూర్తి అవగాహన చేసుకోవటం వల్లనే, వెంకమ్మ కొంత పట్టుదలతో, కొంత అధికార యుతంగా ప్రవర్తిస్తోంది.

*

# పొదుపు స్త్రీలకే పరిమితమా?

నేటి నాగరిక ప్రపంచంలో "పొదుపు" అన్న మాట అన్ని వేళలా, అందరినోటా వింటున్నాం. ముఖ్యంగా ఉపన్యాసాలలో, వార్తా పత్రికలలో స్త్రీలు పదే పదే పొదుపు చెయ్యాలి అని నొక్కి వక్కాణిస్తున్నారు. నిజమే!

అయితే ఆలోచిస్తున్నకొద్దీ 'పొదుపు' స్త్రీలకే పరిమితమా? అనిపిస్తుంది. అసలు పొదుపు అంటే ఏమిటి? పొదుపు చెయ్యవలసింది, చెయ్యతగింది ఏమిటి? అని ఆలోచిస్తే మొట్ట మొదట కాలాన్ని పొదుపు చెయ్యాలి. మానవ జీవితంలో తిరిగి పొందలేనిది కాలం. దాని విలువ తెలుసుకోలేని పురుషులు తప్పని సరిగా ఆఫీసులో పని చేసినా—మిగిలిన కాలాన్ని ఉబుసుపోక కబుర్ల తోనూ, చతుర్ముఖ పారాయణంతోనూ, అదీ ఇదీ కాకపోతే అర్థం, అంతూ లేని రాజకీయ చర్చల తోనూ కాలం వ్యర్థం చేస్తుంటే—ఇక ఇంటి దగ్గర స్త్రీలు పనికిరాని చర్చలతోనో, చేతినిండా డబ్బున్న వారైతే అవసరం లేని షాపింగ్‌తోనో కాలక్షేపం చేస్తుంటారు.

పొదుపు స్త్రీ పురుషులిద్దరికీ అవసరమే! ఒక కుటుంబంలో భార్యా భర్తల్లో ఒకరు పొదుపు చేసేవారు, ఒకరు దుబారా చేసేవారు అయితే ప్రయోజనం శూన్యం. అంతేకాదు. ఈ పరిస్థితుల్లో పిల్లలు ఎవర్ని అనుసరించాలో తెలీక ఒక అస్థవ్యస్త పరిస్థితిలో పెరిగి పెద్దవారై, బాధ్యతారహితులుగా తయారయ్యే అవకాశం ఉంది. ఏవిధంగా గడిపినా కాలం గడిచిపోతుంది. ఏ విధంగా ఖర్చుపెట్టినా డబ్బు ఖర్చయి పోతుంది. మనం చేసే ప్రతి ఖర్చు ఎంతో ఆలోచించి చెయ్యాలి.

పొదుపు అనగానే నాకు తెలిసిన ఒక కుటుంబం గుర్తుకు వస్తుంది. ఆవిడ అతి పొదుపరి; ఆమె భర్త అందుకు వ్యతిరేకం. ఒకసారి వాళ్ళమ్మాయికి జ్వరం వస్తే, డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళకుండా ఆవిడ చిన్న చిన్న చిట్కా వైద్యాలు చేసింది. దాంతో ఆ చిన్న జ్వరం పెద్దదయి ఆ అమ్మాయిని ఆస్పత్రిపాలు చేసింది. కొన్నిరోజులు బాధపడి, ఎంతో డబ్బు ఖర్చయిన తరువాత ఆ అమ్మాయి యింటికి వచ్చింది. నేను చూసివద్దాం కదా అని వాళ్ళింటికి వెళ్తే వాళ్ళ నాన్నగారు భార్యకు తెలియకుండా రకరకాల మందులు కొనుక్కువచ్చి కూతురికిచ్చి "ఎప్పుడన్నా ఒంట్లో బాగుండకపోతే వేసుకోమ్మా!" అన్నారు.

తండ్రి అవతలకు వెళ్ళగానే "చూశారా! నాకు ఒంట్లో బాగుండలేదు. డాక్టరు దగ్గరికి వెళ్తామంటే 'ఆ! ఏం డాక్టర్లు, జబ్బు ఉన్నా లేకపోయినా వెళ్తే మందు రాసివ్వక మానరు. ఈ కషాయం తాగు, ఈ కరివేపాకు ఉండ వేసుకో' అని మా అమ్మ జబ్బు ముదర పెట్టి చివరకు డాక్టర్ దగ్గరకు వెళ్తే—గోటితో పోయే దానికి గొడ్డళ్ళ వరకు వెళ్ళవలసి వచ్చింది. ఇప్పుడు నాన్నగారు రావడం చూశారుగా! అవసరం లేకపోయినాఎప్పుడో వచ్చే సుస్తీకోసం మందులుకొని తెచ్చారు" అన్నది నిట్టూరుస్తూ.

ఈ మధ్య మా ఇంట్లో పెళ్ళి జరిగింది. బంధువు లందరికన్న ముందుగా మా అక్కా బావా వచ్చారు. ఒక రోజు బజారు వెళ్ళిన మా బావగారు పెద్ద సైజు పట్టా సంచి నిండా ఏవో వస్తువులు తేవడం చూసి పిల్లలందరూ చుట్టుముట్టారు. అక్క సంచి తీసుకుని చూసి "ఇన్ని ఎందుకు?" అన్నది.

"పెట్టెకు ఐదు పైసల చొప్పున తగ్గించి ఇస్తానని అన్నాడు. ఐదువందలు టోకుగా తీసుకుంటే సగటున యాభై శాతం డిస్కౌంటు ఇస్తానన్నాడు. సరే అని తీసుకున్నా. జాగ్రత్తగా సర్దేయ్" అన్నారు బావ. అక్క పెట్లో సర్దుతున్నపుడు చూద్దును కదా—అవి సిగరెట్టు పెట్టెలు!

ఇదంతా ఎందుకు చెప్పానంటే ఆడవాళ్ళయినా మగవాళ్ళయినా పొదుపుగా ఏవస్తువయినా వాడడం అలవాటు చేసుకోవాలి. వచ్చే రాబడినిబట్టి ఏది అవసరం, ఏది అవసరం కాదు అని ఆలోచించుకుని ఖర్చు చెయ్యడం మంచిది. అప్పుడే పిల్లలు పొదుపరులుగా, ఆలోచనాపరులుగా తయారవుతారు. అంతేకాకుండా అవసరం లేకపోయినా—పదిమంది స్నేహితుల్ని తన స్వంత ఖర్చుతో హోటల్‌కు తీసుకు వెళ్ళడం, ఇంటికొచ్చి నట్టింట కనబడ్డ పచ్చిమిరపకాయల్ని చూసి భార్యను దుబారా చేస్తున్నావంటూ కేకలు వెయ్యడం మూర్ఖత్వం.

పెట్లో పాతిక చీరలున్నా మరో పది చీరలు కావాలంటూ భర్తను సాధించడం అవివేకం!

కొండముది రుక్మిణీదేవి

ఆ సాయంకాలం చలపతి ఇల్లు చేరుకునేసరికి ఇంట్లో ఒక చిత్రమైన నిశ్శబ్దత అలముకుని వుంది. కాని అర్థం సంధి కుదిరిందని కాదు, పరిస్థితులు మరీ విషమించాయని. చలపతి అడుగులో అడుగు వేసుకుంటూ తన గదిలోకి ప్రవేశించాడు. రాధ గోడవైపు వత్తిగిలి మంచం మీద పడుకుని వుంది. "నాన్నా! అమ్మ పొద్దున్నుంచీ ఏం తినలేదు" అంటూ పెద్ద కొడుకు తండ్రితో ఫిర్యాదు చేశాడు.

"రాధా! మరీ ఇలాగయితే ఎలా? కాస్త ఓర్పు వుండాలి" అంటూ భార్య పక్కన కూలపడ్డాడు చలపతి.

"మీ అమ్మగారు నన్ను...." అంటూ ప్రారంభించిన రాధ నోటికి తన చెయ్యి అడ్డం పెట్టి, "వద్దు. నేనేం వినదలచుకోలేదు. నా మనసూ ఏం బాగలేదు" అన్నాడు చలపతి.

"ఎలా బాగుంటుంది? ఈ ఇంట్లో శాంతి లేదు. మీకయినా ఫరవాలేదు. రోజంతా ఆఫీసులో వుంటారు, నన్ను చూడండి, అస్తమానం తగూలు, తిట్లు... మీ చిన్న మరదలైతే ఇక్కడి పళ్ళెం అక్కడ పెట్టదు. పెద్దావిడ ఇంటెడు చాకిరీ నా మీదకి తోసి టింగురంగా అని పైన కూర్చుంటుంది. ఇలా పనంతా నెత్తినేసుకుంటే, పిల్లల బాగోగులు ఎలా చూడగలను?"

చలపతి కళ్ళు మూసుకుని తల వెనక్కి వాల్చాడు.

"ఛ! ఛ! మరీ ఇంత అన్యాయమా! ఒక పక్క బండెడు చాకిరీ చేయటం, రెండోపక్క తిట్లు తినటం! ఎంతకని ఓర్చుకోవటం? నేనూ మనిషినే."

చలపతి కళ్ళు మూసుకునే, భార్యని శాంతించమన్నట్లు చేతితో సంజ్ఞచేశాడు.

"నాకు ఈ ఇల్లు, ఈ సౌకర్యాలు వద్దు. శాంతి కావాలి, మనశ్శాంతి, ఏ గొడవలూ, పొరపొచ్చాలూ లేని కొంప."

రాధ ప్రాధేయపూర్వకంగా ఇంకా కళ్ళు తెరవని భర్తవంక చూసింది.

"నిన్ను పూర్తిగా అర్థం చేసుకుంటున్నాను. నువ్వు చెప్పదలచుకున్నదీ తెలుసు. కానీ నెమ్మది మీద ఆలోచిద్దాం. ఇలా ఆవేశంలో కాదు" అంటూ చలపతి ఆమెని శాంతింప చూశాడు.

పొద్దున్నుంచీ రాధ ఏమీ తినలేదు. నాలు గయిదుసార్లు వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు ముంచుకుని తాగింది. అంతే. బాగా నీరసంగా వుంది. జ్వరం వచ్చినట్టు తల తిరుగుతూంది. కడుపులో గుడగుడ చప్పుడు అవుతుంటే పుట్టిల్లు జ్ఞాపకం వచ్చింది. అక్కడికి వెళ్ళాలని తహ తహ కలిగింది.

"ఏమండీ! నా మాట ఒకటి వింటారా?" అంది.

భార్య కంఠంలో మార్పు గమనించి చలపతి లేచి సర్దుకు కూర్చున్నాడు.

"ఓ నాలుగు రోజులు బెజవాడ వెళ్ళి వద్దాము. ఈ గొడవలు, పోట్లాటలు మరచిపోదాం. శలవు లకి చిన్నన్నయ్య వచ్చాడట. అమ్మ మరీ మరీ రమ్మని రాసింది."

హైదరాబాదుకీ బెజవాడకీ పెద్ద దూరమేమీ కాదు. కానీ శలవు దొరకటమే సమస్య. భార్యని ఆ విధంగా మార్పుకని తీసుకువెళ్ళి తృప్తి పరచాలని అతనికి కోరిక కలిగింది. అందుకని ఎలాగయినా గట్టిగా ప్రయత్నించి ఓ పదిరోజులు శలవు సంపాదించ నిశ్చయించాడు. "సరే" అంటూ చలపతి చురుగ్గా లేచి నిలబడ్డాడు. భర్త ఉత్సాహం చూసి రాధ సంబరపడింది.

ఈ ప్రయాణం రాధ రెండు కారణాలవల్ల కోరుకుంటోంది. ఒకటి: ప్రస్తుత వాతావరణం నుంచి తప్పించుకునేందుకు; రెండు: ఈ యుద్ధ భూమినుంచి తిన్నగా భర్తని తన పుట్టింటికి తీసుకువెళితే, అక్కడి శాంతియుత వాతావరణం చూపించి, ఆ భేదం ఎలాంటిదో తెలియ జెప్పేందుకు. సమయం చూసుకుని, భర్త వేరింటి కాపురానికి ఒప్పేసుకునేట్లు చేయాలి.

*

ఆ రాత్రి ఇంట్లో ఎంతో నిశ్శబ్దంగా వుంది. ఎవరు వంట చేశారు, ఎవరు భోంచేశారు.... యివన్నీ చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా లేకుండా జరిగిపోయాయి. ఆ మర్నాడే రాధ, చలపతి బెజవాడ ప్రయాణమయారు. ఇలా ఉన్నట్లుండి రాధ పుట్టింటి ప్రయాణం కట్టడానికీ, ముందురోజు జరిగిన రభసకీ ఏదయినా సంబంధ ముందా అని ఊహించేందుకు ఆ ఇంట్లోవారికి ఎక్కువసేపు పట్టలేదు. ఎటువచ్చీ కొడుకు, కోడలు కూడా వెళ్ళటం వెంకమ్మగారికి అంతగా నచ్చలేదు. కానీ ఆ విషయం పైకి అనకుండా ముభావంగా వూరుకుంది.

రాధ ఎంతో ఉత్సాహంగా సామాన్లవీ సర్దింది. భర్త పదిరోజులయాక తిరిగివచ్చినా, తాను మాత్రం నెలరోజులు పోయాక వస్తానని అందరి దగ్గిరా శలవు పుచ్చుకుంది. తోడికోడళ్ళిద్దరూ ఆమె వంక కాస్తంత ఈర్ష్యగా చూస్తే ఆడబిడ్డలు నేస్తులకి మల్లె ఆమె వంక దీనంగా చూశారు. "పిల్లలతో ప్రయాణం జాగ్రత్తమ్మా! ఇల్లు అన్నాక చిన్న చిన్న పొరపొచ్చాలు రాకమానవు. మనసులో ఏం పెట్టుకోకమ్మా. త్వరగా రా" అన్నారు మామగారు. ఆమాటల్నే కళ్ళతో వ్యక్తం చేస్తూ ఆమె వంక చూశారు బావమరుదులు.

*

అనుకోకుండా బండి దిగిన కూతుర్నీ అల్లుణ్ణీ చూసి రాధ తల్లిదండ్రులు మురిసిపోయారు. రాధ చిన్నన్నయ్య కలకత్తానుంచి వచ్చి వారమయింది. ఇల్లంతా సందడిగా వుంది. బావమరిదులతో కబుర్లు, పేకాట, అడుగడుక్కీ జరుగుతున్న మర్యాదలు — చలపతికి గంటలు నిముషాల్లా గడచిపోతున్నాయి.

ఆవేళ చలపతి పెందలాడే భోంచేసి ఓ కునుకు తీశాడు. రాధ వచ్చి లేపేసరికి అతనికి ఇంకా నిద్రమత్తు వదల్లేదు. ఆవేళ సాయంత్రం సినిమా ప్రోగ్రాం. "ఇంకెవరూ రారా" అడిగాడు కాఫీ తాగుతూ.

"ఊహూ. వాళ్ళకి పనులున్నాయట. పిల్లలు కూడా అమ్మమ్మ దగ్గిరే వుంటామన్నారు. మనం ఇద్దరమే" అంది రాధ నవ్వుతూ. చలపతి భార్య వైపు ఓరగా చూశాడు.

సినిమా నుంచి తిరిగి వస్తుంటే దోవలో, "చూశారా! పెద్ద వదిన ఏమంటోందో! మీరు బెజవాడ మార్పించుకోరాదా అనడుగుతూంది" అంది రాధ. చలపతి ఏం అర్థంకానట్లు భార్య వంక చూశాడు. "మనం ఈ వూరు బదిలీ అయితే తనకి సందడి అట. నాగులు అయితే అత్తని వదిలి రానంటోంది" చలపతి ఏమీ సమాధానం చెప్పలేదు.

ఆ రాత్రి రాధకి మంచి నిద్ర పట్టింది. నిద్రలో చక్కని కల కూడా వచ్చింది. ఆ కలలో సాయంత్రం చూసిన సినిమా తాలూకు దృశ్యాలు కనపడ్డాయి. పెద్ద పెద్ద తివాసీలు, సోఫాలు, తెరల మధ్య నాయకీ నాయకుల బదులు తనూ చలపతి వున్నారు. ఆ ఇల్లు ఎంతో బాగుంది. చుట్టూ పూలతోట, కలత నిద్రలో జోగుతూ, రాధ ఉదయం ఆలస్యంగా లేచింది.

ఆ మర్నాడు, మర్నాడు కూడా రాధ చక్కని కలలు కంది. మనసు ఎంతో తేలిగ్గా, హాయిగా వుంది. ఆ ఆనందంలో భర్తతో చర్చించవలసిన ముఖ్య విషయం వాయిదా పడిపోయింది. ఆ విషయం గుర్తుకి వచ్చినప్పుడల్లా, ఏదో ఒక పని అడ్డు తగులుతోంది.

చలపతి శలవు రోజులు అయిపో వస్తున్నాయి. ఆ రోజు ఉదయం చలపతి తాపీగా గెడ్డం గీసు కుంటున్నాడు. పరాకుగా వున్నాడు. ఇంతలో ఉన్నట్లుండి లోపల్నుంచి దభీమన్న శబ్దం విని పించింది. రేజరు అలాగే చేతిలో పట్టుకుని అతను లేచి నిలబడ్డాడు. పిల్లలు హడావుడిగా గదిలోంచి బైటికి పరుగెత్తారు. దూరంగా వంటింట్లో ఓ పిల్లవాడి గొంతు కీచుమంది. ఎత్తు నుంచి కంచు గిన్నె దభాల్న కిందపడిన శబ్దం. వెనువెంటనే దభదభమని అడుగుల శబ్దం. హెచ్చుస్థాయిలో స్త్రీలు వాదించుకుంటు న్నారు. చలపతి గుమ్మం వరకూ వెళ్ళి బైటికి తొంగి చూశాడు.

ఇంటి పెద్దకోడలు చంటి పిల్లని నడుం మీద కుదేసుకుంటూ చరచర మెట్లెక్కిపోతూంది. అత్తగారూ రెండో కోడలూ చేతులు చేతులు తగిలేలా గట్టిగా ఏవో వాదించుకుంటున్నారు. వాళ్ళ మధ్య నుంచి విసురుగా రాధ బైటికి వచ్చింది.

చలపతి ఒక్కడుగు వెనక్కి వేశాడు. రాధ మృదువుగా భర్తని పక్కకి నెట్టి, లోపలికి వెళ్ళింది. అతను తిరిగి చూసి విషయ మేమిటని అడిగేలోపు మంచం మీద వున్న బట్టలన్నీ తోలు పెట్టె వైపు పడేయటం ప్రారంభించింది.

"ఏమో అనుకున్నాను! అబ్బబ్బ! ఇక్కడ ఒక్క క్షణం వుండలేను. ఇదేమయినా కొంపా నరకమా!"

"ఏమయిందే?" అన్నాడు చలపతి మెల్లిగా.

"పదండి. పోదాం. ఈ రాత్రి బండికే. ఇక్కడ ఒక్క క్షణం శాంతిలేదు."

"ఎక్కడికి?" అని అడగలేదు చలపతి. చేతిలో రేజరు కిందపడిపోగా బొమ్మలా నిల్చుండి పోయాడు.

పిల్లలు తెల్లబోతూ తల్లి వంక చూశారు. ★